క్లుప్తంగా

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగు నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు శనివారం 81 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో 0.050 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఓర్వకల్లు : స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జోషులా వాట్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఈ నెల 28 నుంచి మే 22వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదవ తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా విద్యార్థుల ఎంపిక జరుగుతుందన్నారు. అర్హులైన విద్యార్థుల జాబితాను మే 24న పాఠశాలలో ప్రదర్శిస్తామన్నారు. పాఠశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సులల్లో ఒక్కో గ్రూప్‌కు 40 సీట్ల చొప్పున ఉన్నాయని పేర్కొన్నారు.

అమరవీరులను స్మరించుకుందాం



భగత్‌సింగ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పాణ్యం : దేశ కోసం ప్రాణాలు త్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుందామని సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్, ఎస్ఎఫ్ఐ నాయకుడు ప్రతాప్ అన్నారు. శనివారం భగత్‌సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా పాణ్యంలో ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్థసారథిరెడ్డి, మహబూబ్ బాషా, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎంపిక

ఓర్వకల్లు : ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ శాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇస్మాయిల్, మరియానందం సంయుక్త ప్రకటనలో తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యవర్గ కమిటీ ఎన్నికల్లో మండల నూతన అధ్యక్షుడిగా జయప్రకాష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నరేంద్రనాథ్, గౌరవాధ్యక్షులుగా వెంకటరమణ, అదనపు కార్యదర్శిగా రామలింగేశ్వరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా మహబూబ్‌బాషా, మహిళా ప్రతినిధిగా జయశ్రీని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

'పది' పరీక్షలకు 35 మంది గైర్హాజరు

ఓర్వకల్లు : మండలంలోని వేర్వేరు పరీక్షా కేంద్రాలలో శనివారం జరిగిన ఫిజిక్స్ పరీక్షకు 35 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ-2 ఓంకార్ యాదవ్ తెలిపారు. మండంలోని ఐదు పరీక్షా కేంద్రాలలో రెగ్యులర్ మొత్తం 954 మంది విద్యార్థులకు గాను, 939 మంది పరీక్షలు రాయగా, 15 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. ప్రైవేట్ విద్యార్థులలో 158 మంది పరీక్ష రాయాల్సివుండగా 138 మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు.

భగత్‌సింగ్ ఆశయాలను సాధిద్దాం



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు

కోడుమూరు రూరల్: బ్రిటీష్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలను తృణప్రాయంగా వదిలేసిన సర్దార్ భగత్‌సింగ్ ఆశయాల సాధనకు యువత కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ సూచించారు. సర్దార్ భగత్‌సింగ్, రాజుగురు, సుఖదేవ్‌ల వర్ధంతి సందర్భంగా శనివారం సీపీఐ కార్యాలయంలో సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు వారి చిత్రపటాలకు పూల మాళలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన భగత్‌సింగ్, రాజుగురు, సుఖదేవ్‌ల త్యాగాలను ప్రతి భారతీయుడు గుర్తించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు రాజు, రంగస్వామి, వీరన్న, లక్ష్మన్న, తిమ్మప్ప, పెద్దయ్య, మధు పాల్గొన్నారు.

నేడు పోలకల్‌లో మహా రథోత్సవం

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో ఆదివారం చెన్నసోమేశ్వరస్వామి మహా రథోత్సవం ఉంటుందని గ్రామ పెద్దలు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా రేలారే రేలా, జానపద పాటలు, సినీ సంగీత విభావరి, నృత్య ప్రదర్శన, మిమిక్రీ తదితర కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

నాడు అధ్వానం.. నేడు పరిశుభ్రం

- నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు
- ప్రతి పాఠశాలలో బాలబాలికలకు ప్రత్యేకంగా టాయిలెట్లు
- సదుపాయాల కల్పనపై విద్యార్థులు, తల్లిదండ్రుల హర్షం



గడివేముల: టీడీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోని ప్రభుత్వ పాఠశాలలను వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం నాడు-నేడుతో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేసింది. పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థుకు మౌలిక సదుపాయాలు కల్పించింది. అలాగే పాఠశాలల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించింది. పాఠశాలలో చేరిన రోజునే విద్యాకానుకల పంపిణీ, అమ్మ ఒడి, ట్యాబ్‌లను అందించడంతో నేడు సర్కారు బడుల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు.



గని ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు ఉన్న టాయిలెట్స్ (నాడు)

నాడు అధ్వానం

ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు అపరిశుభ్రంగా.. అధ్వానంగా ఉండేవి. వాటిని శుభ్రం చేసేందుకు ప్రత్యేకంగా ఎటువంటి వ్యవస్థ ఉండేది కాదు. చాలా పాఠశాలల్లో విద్యార్థులతోనే తరగతి గదులను శుభ్రం చేయించేవారు. కేవలం ఉపాధ్యాయులకు మాత్రమే టాయిలెట్లు ఉండేవి. వాటిని కూడా కొందరు విద్యార్థులతో శుభ్రం చేయించేవారు. బాలికలకు టాయిలెట్లు లేక పోవడంతో ముళ్లపొదలు, చెట్ల చాటుకు వెళ్లాల్సి వచ్చేది.

నేడు కొత్తకళ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. ప్రభుత్వ బడుల్లో స్వచ్ఛత మెరుగైంది. ఎన్నడూ లేని విధంగా పాఠశాలలన్నీ శుభ్రంగా కళకళలాడుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో చేపట్టిన విప్లవాత్మక చర్యలతో విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు మెరుగయ్యాయి. ముఖ్యంగా టాయిలెట్ల నిర్వహణపై విద్యా శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. ఫలితంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు నేడు పరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి.



విద్యార్థులకు ఏర్పాటు చేసిన అత్యాధునిక టాయిలెట్ (నేడు)

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ లైన్ల మెయిన్‌టెనెన్స్ పనులు చేపడుతుండటం వల్ల ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డీ2 సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపా రు. ఓల్డ్‌టౌన్‌లోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఏరియా, గీతామందిర్ ఏరియా, దండిగేరి, ఉస్మానియా కాలేజీ రోడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పన్ను వసూలు కేంద్రాలు పనిచేస్తాయి

కర్నూలు (టౌన్): పన్ను వసూలు కేంద్రాలు ఆది, సోమవారాలు కూడా పనిచేస్తాయని నగరపాలక మేనేజర్ చిన్నరాముడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని ఆస్తి పన్ను బకాయి దారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యుత్ బిల్లులు కూడా..

కర్నూలు(అగ్రికల్చర్): సెలవు దినాలైనప్పటికీ ఆది, సోమవారాలు ఉమ్మడి కర్నూలు జిల్లాలో విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు పనిచేస్తాయని ఎస్ఈ ఎం.ఉమాపతి శనివారం తెలిపారు.

ప్రజలకు మంచి చేసే వైఎస్సార్‌సీపీకే ఓటు వేయండి

- కోడుమూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్
- కంబదహాల్లో ఎన్నికల ప్రచారం

సి.బెళగల్: రాబోయే ఎన్నికలలో ప్రజలకు మంచి చేసే వైఎస్సార్‌సీపీకే ఓటు వేయాలని కోడుమూరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ కోరారు. శనివారం సాయంత్రం మండలంలోని కంబదహాల్ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించగా.. గ్రామస్తుల నుంచి మంచి స్పందన లభించింది. గ్రామంలోని వీధులలో ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. గ్రామంలో డాక్టర్ సతీష్‌కు పలువురు పెద్దలు, నాయకులు మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరికీ సంక్షేమ పథకాలను దళారులు లేకుండా నేరుగా చేరవేసిన ఘనత దేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, ఆపదలో ఉన్నవారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలను అందిస్తానని హామీ ఇచ్చారు. వచ్చే ఎనికలలో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేసి తనను, పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వీరివెంట స్థానిక సర్పంచ్ చిన్న ఈరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు శోభారాణి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, కార్యదర్శులు మహానంది, బాయికాటి మద్దిలేటి, ముందరింటి వెంకటేష్, గోపాల్, జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్న కొండయ్య, కోఆప్షన్ సభ్యుడు ముల్ల హారున్, జేసీఎస్ కన్వీనర్ సీబీ తులసిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు కరుణాకర్ రెడ్డి, సత్యారెడ్డి, జయరామిరెడ్డి, రామాంజనేయులు, రాముడు, రాజు, సర్పంచ్‌లు దస్తగిరి, ఇమ్మానియేల్, పాండురంగన్న తదితరులు ఉన్నారు.



ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న డాక్టర్ ఆదిమూలపు సతీష్



ఫ్యాన్‌గుర్తుతో డాక్టర్ సతీష్‌ను ఆప్యాయంగా పలకరిస్తున్న వృద్ధురాలు గోవిందమ్మ

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకుందాం

- నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ శేషిరెడ్డి

సి.బెళగల్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకునేందుకు రాజకీయ నాయకులు, ప్రజలు సహకరించాలని కోడుమూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ శేషిరెడ్డి కోరారు. శనివారం ఆయన తహసీల్దార్ అనుపమతో కలిసి మండలంలోని పలు గ్రామాలను సందర్శించి, పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు, ఎన్నికల సిబ్బందికి అవసరమైన వసతులు, సౌకర్యాలను పరిశీలించారు. గొల్లలదొడ్డి గ్రామ యూపీ స్కూల్‌లో గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఎస్ఐ తిమ్మారెడ్డి, ఎన్నికల సెక్టోరియల్ అధికారి, ఈఓఆర్డీ సందీప్ ఉన్నారు.



గొల్లలదొడ్డిలో మాట్లాడుతున్న ఆర్ఓ శేషిరెడ్డి

ఎన్నికల నిబంధనలు పాటించాలి

ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎంపీడీఓ శకుంతల సూచించారు. శనివారం ఆమె ఇనగండ్ల, గుండ్రేవుల, పోలకల్ గ్రామాల్లో పర్యటించి, ఆయా గ్రామాల్లోని బహిరంగ ప్రదేశాల్లో అతికించిన రాజకీయ నాయకుల పోస్టర్లను సిబ్బందితో తొలగించారు. ప్రచారాలకు అనుమతులున్న వాహనాలనే వాడాలని రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు.

రూ.4.3 కోట్ల సీనరేజ్ చార్జీల వసూలు

కర్నూలు (న్యూటౌన్): మేగా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ చేపట్టిన చెన్నై - సూరత్ జాతీయ రహదారి పనులకు సంబంధించి సీనరేజ్ చార్జీల కింద రూ.4.03 కోట్లు వసూలు చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన డిమాండ్ డ్రాఫ్టను మహబూబ్‌నగర్ నేషనల్ హైవే పీడీ శనివారం అందజేశారన్నారు. ఆయన మాట్లాడుతూ మెగా ఇంజినీరింగ్ కంపెనీ చేపట్టిన చెన్నై- సూరత్ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి ఎగ్జిట్ టన్నెల్ పనులకు సంబంధించి సీనరేజ్ ఫీజు, డీఎంఎఫ్, ఇతర ట్యాక్స్‌ల కింద రూ.4,03,51,800 జమ చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, మేగా ఇంజినీరింగ్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



డిమాండ్ డ్రాఫ్టును జిల్లా మైనింగ్ డీడీకి అందజేస్తున్న దృశ్యం

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు

కల్లూరు: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలని, అందుకు పోలీస్ యంత్రాంగం సహకారం ఉంటుందని కర్నూలు సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ ఎం.నరేష్ అన్నారు. శనివారం ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలైన లక్ష్మీపురం, పెద్దటేకూరు, చిన్నటేకూరు, ఉలిందకొండ, కొంగనపాడు, నాయకల్లు గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో కలసి కవాతు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

గూడూరు రూరల్ : అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ప్రజలందరు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కర్నూలు రూరల్ సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. పర్లలో శనివారం ఎస్ఐ శ్రీనివాసులతో కలిసి పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో గొడవలు, ఘర్షణలకు వెళ్లకుండా ప్రశాంత జీవనం గడపాలన్నారు.



ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధిలో కవాతు చేస్తున్న పోలీసులు

భోగేశ్వరంలో వైభవంగా పదహారు రోజుల పండుగ



భోగేశ్వరంలో పూజలు నిర్వహిస్తున్న ఈఓ, ధర్మకర్తలు

గడివేముల: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల అనంతరం శనివారం భోగేశ్వరంలో పదహారు రోజుల పండుగను వైభవంగా నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు శ్యామ్ సుందర్‌శర్మ విశేష పూజలను నిర్వహించారు. అందులో భాగంగా చండీశ్వరుడు, త్రిశూలదేవత అధ్వర్యంలో అంకురాలకు ఉద్వాసన పలుకుతూ కోనేరులో కలిపారు. అనంతరం రథం వద్దకు చేరుకొని వివిధ ద్రవ్యాధిపూజలు నిర్వహించి రథాన్ని భక్తుల మధ్య రథమండపంలోకి చేర్చారు. అమ్మవారికి చీర, సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. పూజ కార్యక్రమాల్లో చైర్మన్ ఐసాని సునీల్‌కుమార్‌రెడ్డి, భక్తులు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

- నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి భార్గవతేజ

కర్నూలు (టౌన్): ప్రజాస్వామ్యంలో ఓటు శక్తివంతమైన సాధనమని, రాజ్యాంగం ఇచ్చిన అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవతేజ సూచించారు. శనివారం బుధవారపేటలోని చెట్టు కింద బడి ప్రాంతం నుంచి మారెమ్మ ఆలయం వరకు ఓటు వినియోగంపై మెప్మా ఆధ్వర్యంలో పొదుపు గ్రూపు మహిళలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటరు పాత్ర కీలకమైనదన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకొని, తప్పనిసరిగా ఓటింగ్‌లో పాల్గొనాలన్నారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నగరపాలక అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, టౌన్ మిషన్ కోఆర్డినేటర్ విజయభారతి, సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్ పెంచలయ్య పాల్గొన్నారు.



ఓటు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

కాలం చెల్లిన ఎరువులు, మందులు విక్రయించరాదు



దుకాణంలో స్టాకును పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్ : ఎరువులు, పురుగుమందుల దుకాణదారులు కాలం చెల్లిన మందులను ఎట్టి పరిస్థితుల్లో రైతులకు విక్రయించరాదని ఏఓ రవిప్రకాష్ హెచ్చరించారు. శనివారం కోడుమూరులోని ఎరువులు, మందుల దుకాణాల్లో ఏఓ తనిఖీలు నిర్వహించి, శాంపిల్స్‌ను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. ఏఓ మాట్లాడుతూ దుకాణదారులంతా కాలం చెల్లిన మందులు, ఎరువులను గుర్తించి వెనక్కి పంపుకోవాలని, వ్యవసాయ శాఖ అనుమతి ఉన్న ఎరువులు, మందులు, విత్తనాలను మాత్రమే దుకాణాల్లో విక్రయించాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రేట్ల ప్రకారమే రైతులకు అమ్మాలని, కొన్న ప్రతి వాటికి రైతులకు రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలని ఏఓ సూచించారు.

అక్రమ మద్యం స్వాధీనం

కోడుమూరు రూరల్ : కోడుమూరు సెబ్ స్టేషన్ పరిధిలోని సి.బెళగల్ మండలం రంగాపురం - యనగండ్ల దారిలో ద్విచక్రవాహనంపై తరలిస్తున్న 4కేసుల కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు సెబ్ సీఐ రామాంజినేయులు శనివారం తెలిపారు. ద్విచక్ర వాహనాన్ని, మద్యాన్ని సీజ్ చేయడంతో పాటు, మద్యం తరలిస్తున్న రంగాపురం వాసి దూదేకుల రజాక్‌ను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

నాటుసారా స్వాధీనం

గూడూరు మండలం కె.నాగలాపురం గ్రామం వద్ద వెల్దుర్తి మండలం లక్ష్మీపురం వాసి బోయ పురుషోత్తంను అదుపులోకి తీసుకుని 15లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రామాంజినేయులు తెలియజేశారు. దాడుల్లో ఎస్ఐ అలీబేగ్, సిబ్బంది హనుమంతు, శంకర్ నాయక్, విరూపాక్షిరెడ్డి, వెంకటేష్ నాయక్, అన్సర్ బాషా పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యం, పట్టుబడిన వాహనాన్ని చూపుతున్న సెబ్ అధికారులు

మందులు వాడితే క్షయ వ్యాధి నయం

గూడూరు: క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ వ్యాధి పూర్తిగా నయమవుతుందని పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రత్యూష అన్నారు. శనివారం క్షయ వ్యాధి నివారణపై పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రెండు వారాలకు పైబడి దగ్గు ఉంటే పీహెచ్‌సీలో గళ్ల పరీక్ష చేయించుకోవాలని సూచించారు. క్షయ వ్యాధిగా నిర్ధారణ అయితే ఉచితంగా మందులు ఇస్తామన్నారు. ర్యాలీలో వైద్యాధికారి డాక్టర్ షఫియా తదితరులు పాల్గొన్నారు.

14 మందికి వీల్ చైర్లు పంపిణీ

పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో ఎన్‌పీపీసీఎఫ్ ప్రోగ్రామ్ కింద 14 మంది వికలాంగులకు వీల్‌చైర్లను వైద్యాధికారులు పంపిణీ చేశారు. చనుగొండ్ల, ప్యాలకుర్తి, కొత్తూరు గ్రామాలకు చెందిన వికలాంగులకు రూ.6 వేల విలువ చేసే వీల్ చైర్లు పంపిణీ చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు.

పంచలింగాలలో అవగాహన ర్యాలీ

కర్నూలు సిటీ: మండల పరిధిలోని ఈ.తాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పంచలింగాల గ్రామంలో అవగహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె విజయమాధురి మాట్లాడుతూ మూడు వారాల పాటు దగ్గు ఉండటం, రక్తంతో కూడిన కఫం, అకస్మాత్తుగా బరువు తగ్గడం, తరచుగా జ్వరం రావడం, ఆకలి మందగించడం, అలసట, నీరసంగా ఉండడం, రాత్రి పూట చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీపంలోపి వైద్యులను సంప్రదించాలన్నారు. పరీక్షల్లో టీబీ నిర్ధారణ అయితే ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే అధునాత వైద్యం అందించి, ఉచితంగా మందులు ఇస్తున్నట్లు చెప్పారు. క్రమం తప్పకుండా వాడి నయం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో టీబీ లేబొరేటరీ సీనియర్ సూపర్‌వైజర్ నిషిత, ఎంపీహెచ్ఈఓ మక్బుల్, పంచలింగాల మెడికల్ స్టాఫ్ పాల్గొన్నారు.



పంచలింగాలలో ర్యాలీ నిర్వహిస్తున్న ఈ.తాండ్రపాడు పీహెచ్‌సీ సిబ్బంది



గూడూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఓర్వకల్లు: ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. శనివారం హుసేనాపురం ఆరోగ్య కేంద్రం పరిధిలోని వెంకటాపురం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన టీకాల కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు, చిన్న పిల్లలకు క్రమం తప్పకుండా సమయానుసారంగా టీకాలు వేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆసుపత్రిలో ప్రసవ గది, ల్యాబ్, ఐసీ, ఓపీ, మందుల స్టోర్‌ను పరిశీలించారు. నిత్యం వైద్యులు ప్రజలకు అందుబాటులో వుంటూ, మెరుగైన సేవలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి కృష్ణాబాయి, హెల్త్ సూపర్‌వైజర్ ప్రకాష్, స్టాఫ్ నర్సు మహిళా ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రోగుల వివరాలను తెలుసుకుంటున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

రాయలసీమ గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ తనిఖీ



రాయలసీమ గ్రీన్ ఎనర్జీ ప్లాంట్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా మైనింగ్ అధికారులు

కర్నూలు (న్యూటౌన్): కల్లూరు మండలం లక్ష్మీపురం పరిధిలో ఉన్న రాయలసీమ గ్రీన్ ఎనర్జీ ప్లాంట్‌ను జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ శనివారం తనిఖీ చేశారు. రాయలసీమ ఫెరోర్ ల్యాస్టింగ్ ప్లాంట్‌లో జిల్లా మైనింగ్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మైనింగ్ డీడీ విలేకరులతో మాట్లాడుతూ ఇనుప ఖనిజం ఎక్కడి నుంచి తెచ్చుకుంటున్నారు, వాటికి సంబంధించిన రాయల్టీ పర్మిట్లు ఉన్నాయా లేదా, ఎవరి నుంచి కొన్నారనే వివరాలను ఆరా తీశామన్నారు. తనిఖీల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.